క్లుప్తంగా

పాలిటెక్నిక్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సీపట్నం : రెండేళ్ల వ్యవధి గల ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం నిర్వహించే శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీఐ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసాచారి తెలిపారు. సదరు విద్యార్థులు ఐటీఐ కోర్సుల్లో 60 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. పాలిటెక్నిక్‌ల్లో నేరుగా రెండో సంవత్సరంలో ప్రవేశం ఉంటుందన్నారు. ఇందుకు కోసం బ్రిడ్జి కోర్సు శిక్షణ ఫిబ్రవరి 21 వరకు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8074266414 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

విధులను నిర్లక్ష్యం చేయొద్దు

నాతవరం : ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని ఎంపీడీవో కె.ఉపాశ్రీ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. వచ్చే నెల ఒకటో తేదీన ఉదయం 5 గంటల నుంచే పింఛన్లు పంపిణీ జరగాలన్నారు. మండలంలో అన్ని రకాలు పింఛన్లు 11వేలకు పైగా ఉన్నాయన్నారు. వేసవిలో దృష్టిలో పెట్టుకుని తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు.

ప్రమాద బాధితుడికి బాసట



గాయపడిన ఈశ్వరరావుకు నగదును అందజేస్తున్న తారువ యూత్, గ్రామస్తులు

దేవరాపల్లి : ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ధర్మవరపు ఈశ్వరరావుకు తారువ గ్రామానికి చెందిన యువత, గ్రామస్తులు బాసటగా నిలిచారు. నిరుపేద కుటుంబానికి చెందిన బాధితుడికి వైద్య ఖర్చులతో పాటు కుటుంబ పోషణ నిమిత్తం గ్రామస్తులంతా కలిసి రూ. 56,650 నగదును సమకూర్చారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడికి తొలి విడతగా రూ. 15,500 నగదును గురువారం అందజేశారు. మిగిలిన సొమ్మును విడతల వారీగా అందజేస్తామని భరోసా కల్పించారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



వలంటీర్లకు మెటీరియల్ అందిస్తున్న ఎంపీడీవో సీతామహాలక్ష్మి

మాకవరపాలెం: నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ప్రోగ్రాం ఉద్దేశ్యమని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 52 మంది వలంటీర్లకు శిక్షణ ఇచ్చి, మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ఒక్కో వలంటీర్ పది మందికి చదువు నేర్పించాలన్నారు. ముఖ్యంగా బ్యాంకు లావాదేవీలపై అవగాహన కల్పించాలన్నారు. నిరక్షరాస్యత నిర్మూలనే లక్ష్యంగా ఉల్లాస్ ప్రోగ్రాం అమలు చేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం మంగ పాల్గొన్నారు.

మేలు జాతి పశువులను వృద్ధి చేయాలి



పశువులకు వైద్యం చేస్తున్న డాక్టర్ నరేష్

నర్సీపట్నం : పాడిరైతులు మేలు జాతి పశువులు వృద్ధి చెందేలా చూడాలని వేములపూడి పశువైద్యాధికారి డాక్టర్ పెట్ల నరేష్ అన్నారు. మెట్టపాలెంలో ఉచిత పశువైద్య శిబిరం గురువారం నిర్వహించారు. శిబిరాన్ని సందర్శించిన ఏడీ మాట్లాడుతూ ముర్రా జాతి నుంచి సేకరించిన నాణ్యత కలిగిన కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు వాడాలన్నారు. వీటి వల్ల పశు సంపదతో పాటు పాల దిగుబడి పెరిగి రైతులకు లాభసాటిగా ఉంటుందన్నారు. శిబిరంలో 35 పశువులకు గర్భకోశ చికిత్సలు, లేగ దూడలకు నట్ట నివారణ మందులు పంపిణీ చేశారు. శిబిరంలో సిబ్బంది రవి, కృష్ణ, రూన్సీ, పాడి రైతులు పాల్గొన్నారు.

నేడు వాసవీమాతకు కుంకుమ పూజలు

మాడుగుల రూరల్ : వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మర్పణ దినోత్సవం పురస్కరించుకొని, కె.జె.పురం జంక్షన్‌లో గల కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గల వాసవీమాతకు శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించనున్నట్టు వాసవీక్లబ్ సభ్యులు, వేంకటేశ్వర దేవాలయ కమిటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పంచామృత అభిషేకాలు, ధూపదీప నైవేద్యంతో పూజలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వాసవీమాత ఆత్మర్పణ దినంను అధికారికంగా గుర్తించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ 'దారి'ద్ర్యం ఇంకెన్నాళ్లు!

- మరమ్మతులకు దిక్కులేని బీఎన్ రోడ్డు
- ప్రమాదాలు బారిన ప్రయాణికులు
- వాహనాలకు నిత్యం నరకం
- హామీలు తుంగలో తొక్కిన కూటమినాయకులు



రోలుగుంట పీహెచ్‌సీ వద్ద గోతులమయంగా ఉన్న రహదారి



మండల కూడలి వద్ద ప్రమాదకరంగా ఉన్న గొయ్యి



మండల కూడలి వద్ద బోల్తాపడిన వాహనం (ఫైల్)

రోలుగుంట : భీమిలి–నర్సీపట్నం రహదారి మరమ్మతులకు కూడా నోచుకోని పరిస్థితి నెలకొంది. ఈ రహదారి మటి రోడ్డును తలపిస్తుంది. రోడ్డు పొడవునా గోతులమయంగా మారింది. ఈ రోడ్డులో వచ్చిపోయే వాహనాలు తప్పించుకునే సమయంలో గోతుల్లో బోల్తా పడి ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రభుత్వం ఏర్పడి సుమారు ఎనిమిది నెలలు కావస్తున్నా, ఎన్నికల ముందు రహదారి పనులు చేస్తాం...రహదారి కష్టాలు తీరుస్తాం అన్న కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ఎక్కడా అమలుకు నోచుకోలేదు. దీంతో ఈ రోడ్డుపై నిత్యం రాకపోకలు సాగించే వాహనాలకు నరకం తప్పడం లేదు.

బాబోయ్...బీఎన్ రోడ్డు..

ఈ రోడ్డులో ఎలా ప్రయాణాలు సాగించాలని ద్విచక్ర వాహనదారులు, పాదచారులు కూడా ఆందోళన చెందుతున్నారు. దెబ్బతిన్న రహదారులు మెరుగుపరచి ప్రయాణికులు, వాహనచోదకుల కష్టాలు తీరుస్తామన్న కుటమి నాయకులు ఇపుడు స్పందించడం లేదేమని ప్రశ్నిస్తున్నారు. నాలుగు నెలలుగా రోడ్లు వేస్తాం..ప్యాచ్ వర్కులు చేస్తాం.. అంటూ మభ్య పెట్టారు తప్ప ఆచరణలో చర్యలు తీసుకోలేదని ప్రత్యక్షంగా విమర్శిస్తున్నారు. మండల కేంద్రం రోలుగుంట పోలీస్‌స్టేషన్ నుంచి నర్సీపట్నం వరకూ భారీ గోతులు దర్శనమిస్తున్నాయి. రెండు మాసాల క్రితం మండల కార్యాలయం కూడలిలో స్థానిక ఎంపీపీ పాఠశాల సమీపంలోను పీహెచ్‌సీ దగ్గర, ధాబాలు ఉన్న చోట పలు వాహనాలు బోల్తా పడ్డాయి. ద్విచక్ర వాహనదారులు తరుచూ ఎక్కడో చోట ఈ గోతుల్లో అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారి కష్టాలు గడిచిన ఏడాది డిసెంబర్‌లోపు తొలగిస్తామని అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్, సంక్రాంతి కల్లా మరమ్మతులు పూర్తి చేసి రోడ్లు నున్నగా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు ప్రకటనలు గుప్పించారు తప్ప ఆచరణలో ఏమాత్రం చర్యలు తీసుకోలేదు.

మరమ్మతులు చేపట్టాలి



మా జీవనోపాధి ఆటోయే. ఆటో నడిస్తేనే మా ఉపాధి నడుస్తుంది. ఇదే ప్రధన రహదారి. గోతుల్లో నిత్యం ప్రయాణించడం వల్ల వాహనాల ఇంజిన్, కట్టలు, టైర్లు, దెబ్బతిని తరచూ మరమ్మతు లకు గరవుతున్నాయి. దీంతో వచ్చే ఆదాయం కన్నా మరమ్మతులకే అధికం కావడంతో అప్పులు చేయాల్సి వస్తుంది. రోడ్డు ప్యాచ్ పనులు చేసినా కొంత సమస్య తీరుతుంది. – బొబ్బిన ఈశ్వరరావు, ఆటో డ్రైవర్, కె.నాయుడుపాలెం

ప్రయాణం నరకప్రాయం



ప్రయాణం నరకప్రాయంగా ఉంది. ఈ రోడ్డు గోతులమయంగా ఉంది. ఉద్యోగరీత్యా ఈ ప్రధాన రహదారిపైనే రావాలి. కొన్ని సమయాల్లో వాహనాలు గోతుల్లో బోల్తాపడి గాయాలవుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా గోతుల పనులు కూడా పూడ్చడం లేదు. మరమ్మతులు చేసి ప్రయాణాలు మెరుగుపరచాలి. – సిహెచ్, శ్రీనివాసరావు, ఉద్యోగి, రోలుగుంట

ధర్మశ్రీ ప్రమాణ స్వీకారానికి తరలిరండి

మాడుగుల రూరల్ : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో అనకాపల్లి పార్లమెంటరీ పార్టీ పరిశీలకునిగా మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ బాధ్యతా స్వీకార కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలి రావాలని సీడీసీ చైర్మన్ సుంకర శ్రీనివాసరావు గురువారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు. కశింకోట సరోజిని గార్డెన్స్‌లో జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, అభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు కె.జె.పురంలో గాంధీ తీర్థం



కె.జె.పురంలో గాంధీ వీధిలో గాంధీ విగ్రహం

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం గ్రామంలో గాంధీ తీర్థం శుక్రవారం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రతి ఏటా గాంధీ వర్ధంతి మరుసటి రోజున ఈ తీర్థం నిర్వహించడం అనవాయితీగా వస్తుంది. గాంధీ వీధిలో గల ప్రజలు ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ఉదయం 9 గంటలకు పాఠశాల విద్యార్థులతో దేశభక్తి గీతాలు ఆలాపన, అనంతరం విగ్రహానికి పూలమాలలు వేస్తారని, అనంతరం స్థానిక పెద్దలు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రసంగం, సాయంత్రం నుంచి పలు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్టు గాంధీ ఉత్సవ కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజలను నమ్మించి మోసం చేసిన చంద్రబాబు

మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



నర్సీపట్నం: చంద్రబాబు ప్రజలను నమ్మించి నిలువునా మోసం చేశాడని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. అనువు కానీ హామీలు ఇచ్చి, అమలు విషయంలో చేతులెత్తేశాడన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హామీలు గురించి ప్రశ్నిస్తుంటే ఎగవేతకు కుంటుసాకులు వెతుకుతున్నాడని విమర్శించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల గురించి ఇప్పుడు మాట్లాడుతున్నారని, సూపర్‌సిక్స్‌లు ప్రకటించినప్పుడు ఎంతో సీనియర్‌నని చెప్పుకున్న చంద్రబాబుకు అప్పుడు ఆర్థిక పరిస్థితులు తెలియదా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు కావస్తున్నా హామీల అమలు జాడలేదన్నారు. ప్రజలను మోసగించడంలో తనకు తానే సిద్ధహస్తుడినని చంద్రబాబు మరోసారి నిరూపించుకున్నారన్నారు. తల్లికి వందనం పేరుతో ఈ ఏడాది తల్లులకు సున్నం పెట్టారన్నారు. మహిళలకు రూ.18 వేలు, నిరుద్యోగులకు రూ.3 వేలు, రైతుభరోసా కింద రూ.20 వేలు సహాయం ఊసేలేదన్నారు. ఆర్టీసీ బస్సు ల్లో ఉచిత ప్రయాణాలకు కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని, వివిధ వృత్తిదారులకు ఇచ్చే పథకాలన్నీ పడకేశాయన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్న, కరోనా లాంటి పరిస్థితులు ఎదురైనా నిర్దేశించిన సమయానికి బటన్ నొక్కి పథకాలు అమలు చేసిన విషయాన్ని గణేష్ గుర్తు చేశారు. సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు జగన్ నిర్మించిన సీ పోర్టులను అమ్మకానికి పెట్టారని విమర్శించారు. తమ ప్రభుత్వం ప్రారంభించిన వైద్య కళాశాలలను తన అనుయాయులకు కట్టబెట్టాలని చూస్తున్నాడని విమర్శించారు. చంద్రబాబు పాలన ఎలా ఉండబోతుందో ప్రజలకు ఏడాది లోపే అర్థమైందన్నారు. మోసపూరిత చంద్రబాబుకు బుద్ధి చెప్పే అవకాశం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు.

అక్షరాస్యత శాతం పెంచడమే ఉల్లాస్ లక్ష్యం



శిక్షణ పూర్తి చేసుకున్న వలంటీర్ టీచర్లకు అభ్యసన సామగ్రిని అందజేస్తున్న ఎంపీడీవో సువర్ణరాజు

దేవరాపల్లి : నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం లక్ష్యమని దేవరాపల్లి ఎంపీడీవో ఎం.వి. సువర్ణరాజు అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన ఉల్లాస్ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వెలుగు వీవోఏలలో నిరక్షరాస్యులైన మహిళలకు చదువు నేర్పించేందుకు ఆసక్తి ఉన్న వెలుగు వీవోఏలకు వలంటీర్ టీచర్లుగా గుర్తించి శిక్షణిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సంఘానికి పది మంది చొప్పున మహిళలకు చదువు నేర్పించాల్సి ఉంటుందన్నారు. అనంతరం వలంటీర్ టీచర్లకు అభ్యసన సామగ్రిని ఎంపీడీవో, ఏపీఎం, ఏవో చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఎస్.ప్రభాకర్, ఎంపీడీవో కార్యాలయ పరిపాలన అధికారి డి.వి. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చర్మంపై స్పర్శలేని మచ్చలుంటే తనిఖీ చేయించుకోండి



ఎ.కోడూరులో సూచనలిస్తున్న సన్యాసిరావు

కె.కోటపాడు : చర్మంపై స్పర్శలేని మచ్చలు కుష్టు వ్యాధికి సంకేతమని అని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ జె.సన్యాసిరావు అన్నారు. ఎ.కోడూరు గ్రామంలో గురువారం ప్రజలకు వైద్య సిబ్బందితో కలిసి ఆయన అవగాహన కల్పించారు. ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13 వరకు పక్షోత్సవాలలో భాగంగా కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. కనుబొమ్మలు, కనురెప్పలు రాలిపోవుట, చెవులు, ఛాతీమీద కణితులు, బుడిపెలు, ముఖం నూనె రంగులోకి మారడం కుష్టు వ్యాధికి లక్షణాలుగా తెలిపారు. కుష్టును ప్రాథమిక దశలోనే గుర్తిస్తే ఎండీటీ మాత్రల ద్వారా నయం చేయవచ్చని తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఏఎన్‌ఎం సంతోషికుమారి పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



మేడిచర్లలో అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : మేడిచర్ల గ్రామంలో గల అభయాంజనేయ స్వామి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమాది కార్యక్రమాలతో పాటు కుంకుమ పూజలు జరిపారు. స్వామి వారిని మాజీ డిప్యూటీ సీఎం, అనకాపల్లి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిపారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కిల్లి జగన్నాథం, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఆదిరెడ్డి వెంకటరావు, ఆదిరెడ్డి మహేష్, ఆర్.పి.నాయుడు, సూర్రెడ్డి బాబూరావు, బొడ్డు సింహాచలం, బొడ్డు వెంకటరావు, కృష్ణారావు, చినబాబు, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

మోదమాంబకు అరకిలో వెండి సమర్పణ



ఎం.కోడూరు మోదమాంబ ఆలయంలో వెండిని అందజేస్తున్న దాత వరహామూర్తి

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు మోదమాంబ అమ్మవారికి గ్రామానికి చెందిన లంక వరహామూర్తి, అంజలి దంపతులు గురువారం అర కిలో వెండిని సమర్పించారు. ఆలయంలో ఈ వెండిని గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావుకు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిన రమణబాబు, నాయకులు పడాల అప్పలనాయుడు, మజ్జి ఏసు, అర్జునరావు, నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మ పాల్గొన్నారు.

ఎట్టకేలకు కల్వర్టు పనులు



పొక్లెయిన్‌తో కల్వర్టు పనులు

నాతవరం : ఎట్టకేలకు ఆర్అండ్‌బీ రోడ్డుకు కల్వర్టు పనులు ప్రారంభించారు. గునుపూడి చినగొలుగొండపేట మధ్య అర్అండ్‌బీ రోడ్డుకు చెరువుగట్టు వద్ద కల్వర్టు శిథిలమై ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఈ కల్వర్టుకు ప్రభుత్వం అర్అండ్‌బీ శాఖ రూ.7 లక్షలు మంజూరు చేసింది. కాగా పనుల్లో జాప్యం జరిగింది. తాజాగా కల్వర్టు పనులు ప్రారంభించడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

గాంధీమార్గం అనుసరణీయం



పెదబొడ్డేపల్లిలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ప్రేమసమాజంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



తామరంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న హరిబాబు, తదితరులు



కె.కోటపాడులో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న నూర్జహన్, విద్యార్థులు



బోయిలకింతాడలో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు



వడ్డాదిలో గాంధీ విగ్రహం వద్ద నివాళుర్పిస్తున్న వర్తక సంఘ నాయకులు



దేవరాపల్లిలో గాంధీ వర్ధంతి కార్యక్రమంలో సీపీఎం నేతలు వెంకన్న తదితరులు

నర్సీపట్నం: గాంధీ వర్ధంతి సందర్భంగా పెదబొడ్డేపల్లి పెద్ద చెరువు వద్ద ఉన్న గాంధీజీ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, పార్టీ నాయకులు పెట్ల అప్పలనాయుడు, బేతిరెడ్డి విజయ్, తమరాన శ్రీను, యాదగిరి శేషు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చేందుకు గాంధీ చేసిన కృషిని కొనియాడారు. అలాగే వాసవీ క్లబ్, వనితా క్లబ్ వారు శ్రీవాసవీ కళ్యాణ మండపం వద్ద గాంధీ విగ్రహానికి క్లబ్ ప్రతినిధులు వెలగా నారాయణ రావు, డాక్టర్ సి.ఎస్.కుమార్ పూలదండలు వేసి నివాళులర్పించారు. స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించి, పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర సరుకుల కిట్లు అందజేశారు. క్లబ్ కార్యవర్గ సభ్యులు నాళం రమేష్ కుమార్, కేదార్‌శెట్టి బంగారుశెట్టి, తాటికొండ హేమంత్, పల్లపోతు గణేష్ సహకారంతో సరకులు అందజేశారు.

మాకవరపాలెం: గాంధీ వర్ధంతి సందర్భంగా తామరం సచివాలయం వద్ద తూర్పుకాపు సంఘ అధ్యక్షుడు గొంతిన హరిబాబు, పంచాయతీ కార్యదర్శి బాలదొర గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వర్తక సంఘం ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పి.ఎస్.ఎన్.మూర్తి, ఉప సర్పంచ్ లాలం రాము పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్వాతంత్ర్య సాధనలో మహాత్మ గాంధీజీ పాత్ర ప్రముఖమని అయ్యన్న విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్.కె.నూర్జహన్ అన్నారు. పాఠశాలలో గల గాంధీ విగ్రహానికి గురువారం వర్ధంతి సందర్భంగా పూలమాలను విద్యార్థులతో కలిసి వేసిన ఆమె నివాళులను అర్పించారు. గాంధీ చూపిన అహింసా మార్గం ప్రతి ఒక్కరికి అనుసరణీయమని పేర్కొన్నారు. అయ్యన్న ఇంగ్లిష్ మీడియంకు చెందిన విద్యార్థులు గాంధీ వర్ధంతి సందర్భంగా స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్‌కు స్ఫూర్తినిచ్చేలా విద్యార్థులు ప్రదర్శన జరిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.కె.ఖాసిమ్ పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేట : మండల కేంద్రం బుచ్చెయ్యపేట, మేజర్ పంచాయితీ వడ్డాది, విజయరామరాజుపేట,సీతయ్యపేట, బంగారుమెట్ట, తదితర గ్రామాల్లో గాంధీ వర్ధంతి నిర్వహించారు. వడ్డాదిలో వర్తక సంఘ నాయకులు నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళర్పించారు. పలు గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని బోయిలకింతాడలో స్టూడెంట్ యూనియన్ సభ్యుల ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు దాసరి వెంకటరమణ, స్టూడెంట్ యూనియన్ సభ్యులు పడిదడకల గోపి, బత్తుల నానాజీ పాల్గొన్నారు. దేవరాపల్లిలో రామాలయం ఎదురుగా ఉన్న గాంధీజీ విగ్రహానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్న, మండల కార్యదర్శి బి.టి.దొర పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

చోడవరం రూరల్ : జాతిపిత, పూజ్య బాపూజీ, మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక ప్రేమసమాజంలో గాంధీ విగ్రహం వద్ద ఘన నివాళులర్పించారు. ప్రేమసమాజం కార్యదర్శి ప్రసాదరాజు ఆర్క్ సంస్థ కార్యదర్శి డి.ఎస్.ప్రసాద్, సమాచార హక్కుల చట్టం ప్రతినిధి మోహన్ రాజ్ తదితరులు గాంధీ విగ్రహానికి పుష్పమాలలు అలంకరించి అంజలి ఘటించారు. ప్రేమసమాజంలోని విద్యార్థులు పాల్గొన్న కార్యక్రమంలో దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీ సేవలను కొనియాడారు.

రాష్ట్రపతికి అంగన్‌వాడీ సిబ్బంది వినతులు



వినతి ప్రతులను చూపిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

బుచ్చెయ్యపేట : అంగన్‌వాడీ సిబ్బంది తమ డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పోస్టు ద్వారా వినతి పత్రాలు పంపించారు. అంగన్‌వాడీ టీచర్లను, ఆయాలను గ్రేడ్ త్రి, గ్రేడ్ ఫోర్ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు చొప్పున రెగ్యులరైజేషన్ బకాయిలు చెల్లించాలని, 6 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన పిల్లలందరికీ శిశు సంరక్షణ, విద్య,అభివృద్ధిని కట్టుదిట్టంగా అమలు చేయాలని కోరుతూ గురువారం రాష్ట్రపతికి వినతి పత్రాలను పంపించారు.

విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం కీలకం

రోలుగుంట : త్వరలో జరగనున్న పది పరీక్షల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని జెడ్పీ హైస్కూలు హెచ్ఎం ప్రసాదరావు అన్నారు. పాఠశాలలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. పది పరీక్షలకు గడువు ఇంకా 45 రోజుల మాత్రమే ఉందన్నారు. ఉపాధ్యాయులు పరీక్షలు అయ్యేంత వరకూ ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల అభ్యాసంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాత్రిపూట అదనంగా మరో గంటపాటు చదివేలా చూడాలన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి



దేవరాపల్లిలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు వెంకన్న, దొర తదితరులు

దేవరాపల్లి: నెల్లూరులో వచ్చే నెల 1,2,3 తేదీలలో జరిగే రాష్ట్ర సీపీఎం మహా సభలను విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి బి.టి. దొర కోరారు. ఈ మేరకు దేవరాపల్లిలో గురువారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వెంకన్న, దొర మాట్లాడుతూ దేశంలో మతోన్మాద శక్తులు పెచ్చుమీరుతున్నాయని, దేశాన్ని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలు జోరుగా జరిగిపోతున్నామని విమర్శించారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలకు ఎగనామం పెట్టిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు, దళితులు, గిరిజనులు, రైతు, వ్యవసాయ కార్మికులు, పేద, మధ్య తరగతి, ఉద్యోగ, నిరుద్యోగ సమస్యలు,కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్ల సమస్యలపైన, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మహాసభలో చర్చించి ఉద్యమ కార్యాచరణ చేస్తామని, అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చా. కార్యక్రమంలో కె.రాము, ఈ.దేముడు, టి.శంకర్, జె.ఈశ్వరరావు, జె.పోతురాజు పాల్గొన్నారు.

ఆదివాసీ భూములకు రక్షణ కల్పించాలి



మాడుగులలో ర్యాలీలో పాల్గొన్న ఆదివాసీ గిరిజన సంఘ సభ్యులు

మాడుగుల : ఆదివాసీ భూములకు రక్షణ కల్పించాలని, రెవెన్యూ సదస్సుల్లో అందజేసిన దరఖాస్తులు పరిశీలించి న్యాయం చేయాలని, ఆదివాసీ సంఘ గౌరవ అధ్యక్షుడు అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలో గల ఆదివాసీ సంఘ సభ్యులతో ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. జాలంపల్లి పంచాయతీలో 175 కుటుంబాలకు 30 ఏళ్ల క్రితం అందిచిన సీలింగ్ మిగులు భూములు సాగు చేస్తున్నా సరే నేటికీ వారికి పట్టాలివ్వకపోవడం వల్ల వారికి ప్రభుత్వ పథకాలు అందలేదన్నారు. జిల్లాలో 8 మండలాల్లో ఆదివాసీలు ఉన్నారని, వీరి సమస్యల కోసం నెలలో ఒక్క రోజు ప్రత్యేక ఫిర్యాదులు దినం ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. అంతకు ముందు స్థానిక గాంధీ పార్కు వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఆదివాసీ అసంఘటిత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ ఆదివాసీలందరూ ఐకమత్యంగా పోరాటానికి ముందుకు రావాలన్నారు.